# ముఖ్యమంత్రి కార్యాలయము

## తెలంగాణ ప్రభుత్వం

పత్రికా ప్రకటన-1 26, డిసెంబరు, 2014

హైదరాబాద్ నగరంపై ఇక పూర్తి స్థాయి దృష్టి పెడతామని, ఇక్కడ మంచి వాతావరణంలో ప్రజలు బతికేటట్లు ట్రాఫిక్ ఇబ్బందులు లేని రహదారులు నిర్మించేందుకు ప్రాధాన్యతనిస్తామని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు అన్నారు. హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ సమస్యను ఎదుర్కొనేందుకు రద్దీగా ఉన్న జంక్షన్లలో కూడా వాహనదారులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రయాణం సాగించటానికి అనువుగా మల్టి లెవల్ ఫ్లైఓవరు, స్కైవేలు నిర్మించాలని ఇదివరకే నిర్ణయించిన ముఖ్యమంత్రి, దీనికి సంబంధించిన పూర్తి స్థాయి సమీక్ష నిర్వహించారు.

నాస్‌డాక్‌లో శుక్రవారం జరిగిన ఈ ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో ప్రభుత్వ సలహాదారు పాపారావు, యంపి.కె.కేశవరావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజీవ్‌శర్మ, సిఎంఓ ముఖ్యకార్యదర్శి నర్సింగరావు, జిహెచ్ఎంసి కమీషనర్ సోమేష్‌కుమార్, ఆర్ అండ్ బి శాఖ ముఖ్య కార్యదర్శి సునిల్ శర్మ, మున్సిపల్ శాఖ కార్యదర్శి ఎస్‌కె.జోషి, ఆర్థిక శాఖ కార్యదర్శి రామకృష్ణారావు, ఫారెస్టు ఓఎస్‌డి ప్రియాంక, ఆర్ అండ్ బి అధికారులు బిక్షపతి, రవీందర్ రావు, లీ అసోసియోట్స్ ప్రతినిధులు డా.టిఎస్.రెడ్డి, డా.ఫణిరాజ్ తదితరులు ఈ సమీక్షలో పాల్గొన్నారు.

దాదాపు ఐదు గంటల పాటు జరిగిన సమీక్షలో హైదరాబాద్ నగరంలోని ముఖ్యమైన రహదారులు, జంక్షన్‌లు, వాటి ప్రస్తుత పరిస్థితి, భవిష్యత్తులో అక్కడ ఎదురయ్యే ట్రాఫిక్ సమస్యలు, ట్రాఫిక్ రద్దీ నివారణకు తీసుకోవలసిన చర్యలు తదితర అంశాలపై కూలంకషంగా చర్చించారు. ఒక్కో జంక్షన్, ఒక్కో రహదారి గురించి విడివిడిగా సమీక్షించారు. ప్రస్తుతం ఉన్న రహదారులు, జంక్షన్‌లు, ఫ్లైఓవర్లు ఇప్పటి

రద్దీనే తట్టుకోలేకపోతున్నాయని, వాటిని అలాగే వొదిలేస్తే భవిష్యత్ తరాలు మరిన్ని ఇబ్బందులు పడాల్సి వస్తుందని ముఖ్యమంత్రి అన్నారు. రాబోయే 20 ఏళ్ల నాటి పరిస్థితిని అంచనా వేసి అందుకు తగ్గట్టుగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని చెప్పారు. నగరంలో ఎక్కడెక్కడ మల్టి లేవల్ ఫ్లైఓవర్లు నిర్మించాలి? ఎ ఎ రోడ్డును వెడల్పు చేయాలి? ఎంతమేరకు వెడల్పు చేయాలి? ఎ రూట్లలో స్కైవేస్ నిర్మించాలి? అనే అంశాలపై కూడా చర్చించారు. నగరంలోని బంజార్‌హిల్స్ పార్కు చుట్టూ ఉన్న జంక్షన్లు, ఉప్పల్, ఎల్‌బి నగర్, ఖైరతాబాద్, నెక్లెస్ రోడ్ ఇందిరాగాంధి, ట్యాంక్‌బండ్ అంబెడ్కర్, అబిడ్స్ చాదర్‌ఘాట్, జెఎన్‌టియు, ఒవైసి హాస్పిటల్, ఈసిఐఎల్ ఎక్స్‌రోడ్, కొత్తగూడ ఎక్స్‌రోడ్, కోఠి, కూకట్ పల్లి వై రోడ్, ఆర్‌టిసి క్రాస్‌రోడ్స్, అంబర్‌పేట, హబ్సిగూడ, తిరుమలగిరి, ప్యారడైజ్, మైండ్స్ ప్లేస్, కెహిహెచ్‌బి, బాలానగర్, బోయినపల్లి, వేంపల్లి, సుచిత్ర, మారియట్ హోటల్, బుద్ధ భవన్, మాసాబ్ ట్యాంక్, బిహెచ్‌ఇఎల్, మెహిదిపట్నం, మియాపూర్, ఓల్డ్ రాయదుర్గం, లకిడికాపూల్, గ్రీన్‌ల్యాండ్, ఎంజె మార్కెట్, చార్మినార్, గోషామహల్, నల్లకుంట, నాంపల్లి తదితర జంక్షన్లలో జనం రద్దీ ఎక్కువగా ఉంటుందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. వాహనాల రద్దీ ఎక్కువగా ఉండే పలు రూట్లను కూడా హై ప్రెషర్ కారిడార్స్‌గా గుర్తించారు. వాహనాలు ఎక్కడా ఆగకుండా, సిగ్నల్ కోసం ఎదురు చూడకుండా ఎవరిదారిన వారు సాగిపోయేలా రవాణా వ్యవస్థను తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి చెప్పారు. ఇందుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని కోరారు. ఎ ప్రాంతంలో ఎలాంటి నిర్మాణం అవసరం? ఎ రహదారిని ఎంతమేరకు వెడల్పు చేయాలి? ఎన్ని లైన్ల రోడ్డు నిర్మించాలి? ఎన్ని బ్రిడ్జిలు నిర్మించాలి? వాటికి ఎంత డబ్బు అవసరం అవుతుంది? తదితర అంశాలపై పూర్తి స్థాయి ప్రాజెక్టు రిపోర్టు అందించాలని ఆదేశించారు.

## వాతావరణ సమతుల్యతకు ప్రాధాన్యం

నగరంలో ట్రాఫిక్ సమస్యలు నివారించడంతో పాటు వాతావరణ సమతుల్యతను కాపాడటం కూడా అత్యంత అవసరమని ముఖ్యమంత్రి అన్నారు. హైదరాబాద్ నగర పరిధిలో లక్షా 60 వేల ఎకరాల అటవీ భూమి ఉన్నదని, వేరు వేరు ప్రాంతాల్లో ఉన్న ఈ అటవీ భూమిని రక్షించడంతో పాటు అందమైన ఉద్యానవనాలుగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి చెప్పారు. చాలా నగరాలకు లంగ్ స్పేస్ లేదని, కాని హైదరాబాద్‌కు కావాలసినంత లంగ్ స్పేస్ ఉందని అన్నారు. పార్కులు, గ్రీనల్యాండ్, రిజర్వు ఫారెస్టు భూములు కూడా అన్యాక్రాంతం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. చివరికి బొటానికల్ గార్డెన్‌ను కూడా కబ్జా చేయడానికి ప్రయత్నించారని, కాని స్థానికులు పోరాడి కాపాడుకున్నారన్నారు. నగరంలోని ప్రతి చోట కూడా ఇలాంటి చైతన్యమే రావాలన్నారు. పార్కుల కొసం కేటాయించిన స్థలాన్ని రక్షించుకోవడానికి, వాతావరణ సమతుల్యాన్ని కాపాడే సాధనాలుగా మలచుకోవడానికి సిటిజన్ కమిటీలు వేయాలని కూడా ముఖ్యమంత్రి నిర్ణయించారు. కబ్జాదారులను కఠినంగా శిక్షించేందుకు పటిష్టమైన చట్టాలు తెస్తామన్నారు. ఇకపై నగరంలో ఎలాంటి నిర్మాణాలు జరగాలన్నా కేవలం జిహెచ్ఎంసి అనుమతే కాకుండా ప్రభుత్వ అనుమతిని కూడా తప్పనిసరి చేస్తూ నిబంధనలు రూపొందించాలన్నారు. వాకర్లకు, జాగింగ్ చేసే వారికి, సైక్లిస్టులకు వేరు వేరుగా ట్రాక్‌లు నిర్మిస్తూ ఉద్యానవనాలను తీర్చిదిద్దుతామన్నారు. మూసి నది నుండి వనస్థలిపురం వరకు వందల ఎకరాల విస్తీర్ణంలో భూమి ఉందని, అది చెట్లు పెంచడానికి, పార్కుల అభివృద్ధికి ఉపయోగకరంగా ఉన్నదన్నారు. కొద్ది రోజుల్లోనే తాను నగరంలో ఏరియల్ సర్వే నిర్వహించి ఎక్కడెక్కడ భూమి ఉంది, అక్కడ పార్కుల అభివృద్ధికి ఎలాంటి అవకాశాలు ఉన్నాయో పరిశీలిస్తానని చెప్పారు.

హైదరాబాద్ తర్వాత రెండవ అతిపెద్ద నగరమైన వరంగల్‌పై కూడా దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి అన్నారు. వరంగల్ నగరంలో ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉండే

రెండు మూడు చోట్ల మల్టి లెవల్ ఫ్లై ఒవర్లు నిర్మించాలన్నారు. మడికొండ నుండి హన్మకొండ చౌరస్తా, ఎంజిఎం, పోచమ్మ మైదాన్, నర్సంపేట రోడ్డు వరకు ఉన్న రహదారిని <u>150 అడుగుల</u> వరకు విస్తరించాలని చెప్పారు. హంటర్ రోడ్డు, కరీంనగర్ రోడ్డు, ఆర్ఇసి-కేయుసి రోడ్డులను మెరుగుపరచాలన్నారు. వరంగల్, ఖమ్మం, నిజామాబాద్, కరీంనగర్ నగరాలకు రింగ్‌రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేయాలన్నారు.

---

సిపిఆర్ఓ టు సిఎం